విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 12 నవంబరు 2024 8 పేజీలు

ఇసుక దోపిడీ అరికట్టండి

ఉచిత ఇసుక సక్రమ అమలుకు చర్యలు చేపట్టండి

కలెక్టరేట్ల వద్ద ఏఐటీయూసీ ఆందోళన

ప్రభుత్వమే ఇసుక ర్యాంపులు నిర్వహించాలని, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని, భవన నిర్మాణ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ బిల్డింగ్, కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాపిత పిలుపుమేరకు సోమవారం ఏలూరు, భీమవరం, కాకినాడ, రాజమండ్రి కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కన్స్ట్రక్షన్ రంగంలో వసూలు చేస్తున్న 1 శాతం సెస్ నిధులు భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ మండలి ద్వారా సంక్షేమ పథకాలు పున:ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ఏలూరులో

విశాలాంధ్ర-ఏలూరు: ప్రభుత్వమే ఇసుక ర్యాంపులు నిర్వహించాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునః ప్రారంభించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ బిల్డింగ్, కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాపిత పిలుపుమేరకు ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కంకిపాటి బుచ్చిబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న 42 వేల క్లైములకు నిధులు మంజూరు చేసి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇసుకపై విధించిన జి.ఎస్.టి.తో పాటు ఇతర పనులు రద్దు చేయాలని కోరారు.గత ప్రభుత్వం సెస్ రూపేణా వసూలు చేసి ఇతర సంక్షేమ పథకాలకు వాడుకున్నారని విమర్శించారు. గత ఎన్నికలలో కూటమి తాము అధికారంలోకి వస్తే ఇసుక పాలసీని మార్చి అందరికీ ఉచితంగా ఇక ఇస్తామని, సంక్షేమ బోర్డును పునః ప్రారంబించి కార్మికులకు న్యాయం చేస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణం కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి దారి మళ్లించిన నిధులను తిరిగి జమ చేయాలని డిమాండ్ చేశారు.తమ సమస్యలు పరిష్కారం కానీపక్షంలో ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తున్నామని ప్రకటనలు చేస్తున్నారని, ఆచరణలో ఎక్కడ అమలు పరిచిన దాఖలాలు లేవని విమర్శించారు.ఉచిత ఇసుక పాలసీ ప్రకటనలకే పరిమితమైందని రుజువైందన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకాన్ని అమలు చేయాలని,విశ్వకర్మ కార్డు కలిగిన కార్మికులకు షరతులు లేకుండా బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తక్షణం భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో రానున్న కాలంలో పెద్ద ఎత్తున

భీమవరంలో

రాజమండ్రిలో

కాకినాడలో

▶మిగతా 2లో..

సోలార్ విరివిగా ఉపయోగించాలి

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: సాంప్రదాయేతర ఇంధన వనరులైన సౌరశక్తి వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. సోమవారం స్థానిక అమీనాపేటలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో ఏర్పాటుచేసిన సోలార్ పవర్ ప్లాంట్ ను కలెక్టర్ కె. వెట్రిసెల్వి పరిశీలిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూఫ్ టాప్ సోలార్ సిస్టం మంచి ప్రాజెక్ట్ అని, ఇక్కడ ఏర్పాటుచేసిన ప్లాంట్ బాగుందని, సంతృప్తి వ్యక్తం చేశారు. రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ఆదాతో పాటు అతితక్కువ ధరకే విద్యుత్ అందుతుందన్నారు. ఈ సందర్బంగా ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి. సాల్మన్ రాజు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో 3 కె డబ్ల్యూ సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. హాస్టల్లో సోలార్ ప్లాంట్ అమరిక ముందు నెలకు 950 యూనిట్లు వినియోగం ఉండగా, 3 కె డబ్ల్యూ సోలార్ ఏర్పాటు తదుపరి 432 యూనిట్లు వినియోగం జరుగుతుందన్నారు. గతంలో నెలలో సుమారు 9 వేల వరకు విద్యుత్ చార్జీలు అవుతుండగా సోలార్ ప్లాంట్ పెట్టడం మూలంగా సుమారు నెలకు రూ.4500 మాత్రమే బిల్లు వస్తుందని, బిల్లు రావడం ద్వారా సుమారు 50 శాతం వినియోగం చార్జీలు తగ్గడం జరిగిందన్నారు. కలెక్టర్ వెంట సాంఘీక సంక్షేమ శాఖ జెడి వి. జయప్రకాష్, మున్సిపల్ కమీషనరు ఎ. భానుప్రతాప్, విద్యుత్ శాఖ డి.ఇ. అంబేద్కర్, ఎడిఇ రాజ్‌కుమార్, సోలార్ ప్లాంట్ వెండర్ సతీష్, ఎలక్ట్రికల్ ఏఈప్రసన్నవల్లి, తహశీల్దారు జి.వి. శేషగిరి తదితరులు ఉన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

విశాలాంధ్ర -ముసునూరు: ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు డిమాండ్ చేసారు. సోమవారం ముసునూరు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల సమస్యల పట్ల పలు అంశాలపై రైతులతో కలిసి తహసీల్దార్ రాజ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాయంకుల మాట్లాడుతూ విద్యుత్ సర్దుబాటు ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రభుత్వం రైతులు, ప్రజలపై రూ. 8వేల కోట్ల అదనపు భారం మోపనుందని, నేడు అందని ద్రాక్షలా మారిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం విద్యుత్ సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, రైతులకు తక్షణమే పెట్టుబడి సాయంగా రూ. 20వేలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి నాగేశ్వరరావు చెంగల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో: రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాపితంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు పుల్లారు సోమశేఖర్, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ మాట్లాడుతూ పంటల బీమా

▶మిగతా 4లో

నిర్వాసితులను పట్టించుకోని ప్రభుత్వాలు

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ

విశాలాంధ్ర - వేలేరుపాడు : ఏళ్ల నాటి సర్వేలతో, గతంలో తప్పిదాలను సరిచేయకుండా నిర్వాసిత కుటుంబాలకు ఏమాత్రం న్యాయం జరగదని, తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచిం చాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. తాటి దుర్గారావు అధ్యక్షతన బండ్లబోరు గ్రామ శాఖ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కార్యదర్శి, రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మునీర్ నిర్వాసిత సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వాలు

▶మిగతా 4లో

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు పోసియ్య

విశాలాంధ్ర-పెంటపాడు : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆధ్వర్యంలో నవంబర్ 9న విజయవాడలోని ఐజిఎంసి స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ 2024-25 సం" రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు నల్లి పోసియ్య ఎంపికయ్యారు. ఈయన పెంటపాడు గవర్నమెంట్ పోస్ట్ బేసిక్ పాఠశాలలో పిజిటి మరియు వృక్షశాస్త్రం ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. త్వరలో పూణే(మహారాష్ట్ర)లో జాతీయస్థాయిలో జరగబోయే వాలీబాల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్

జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పోసియ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓలు ఎం. శ్రీనివాస్, టీవీ.రామకృష్ణ, ఎస్ఎంసి చైర్మన్ కళింగ లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయులు ఎన్. రాజేష్, పిజిటి పోసియ్యను ఇదే స్ఫూర్తితో క్రీడారంగంలో రాణిస్తూ, దేశం తరపున జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని అభినందించారు.

జి.వి ఎస్.వి ఆర్.ఎం.లో జాతీయ విద్యా దినోత్సవం

విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లు పట్టణ పరిధిలోని జి.వి ఎస్.వి ఆర్.ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం రసూల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వతంత్ర భారత దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మౌలానా చిత్రపటానికి పూలమాల వేసి నివాళు

లర్పించారు. విద్యార్థిని విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం రసూల్ సేవా సంస్థ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని, జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. భారత స్వతంత్ర పోరాటంలో హిందూ ముస్లింల ఐక్యత కృషి చేసిన గొప్ప వ్యక్తి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ మస్తాన్ వలీ ఖాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవానీ ప్రసాద్ రాయపూడి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కేల్ఆఫ్ ఫైనాన్స్ నిబంధనలు అనుసరించి రైతులకు రుణాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర-ముసునూరు: రిజర్వు బ్యాంక్ ఉత్తర్వుల ప్రకారం రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అక్కిరెడ్డిగూడెం బ్రాంచ్ మేనేజరుకు సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు రాయంకుల లక్ష్మణరావు,

నిమ్మగడ్డ నరసింహ మాట్లాడుతూ పంట రుణాలు పంటలు వేసిన రైతులకు,కౌలు రైతులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతాంగానికి ఎక్కువ మేలు చేస్తున్నామని చెప్పడం తప్ప చేతలు అందుకు అనుగుణంగా లేదని విమర్శించారు. బ్యాంకులు రబీ సీజన్ వచ్చినప్పటికీ కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. అక్కిరెడ్డిగూడెం బ్యాంకు మేనేజర్ సానుకూలంగా స్పందించారని హర్షం వ్యక్తం చేశారు.

సిపి బ్రౌన్ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-భీమడోలు: తెలుగు బాషా సేవకు ఆవిరళ కృషి చేసిన సీపీ బ్రౌన్ సేవలు ప్రశంస నీయమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు లైబ్రరీలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీపీ బ్రౌన్ 226 వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిత్రపటం వద్ద నివాళ్లు అర్పించారు. సాహిత్య రంగానికి ఆయన

చేసిన సేవలను కొనియాడారు. ఈనెల 14వ జాతీయ గ్రంథాలయం వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. తొలుత చిన్నారులు సామూహిక పుస్తక పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల చిన్నారులు పాల్గొన్నారు.

దోపిడీ అరికట్టండి

(1వ పేజీ తరువాయి)

ఆందోళనలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి చేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం పెళ్ళికానుక, కార్మికులకు గాయపడితే ఇచ్చే నష్టపరిహారం ఇతర క్లెయిములు పరిష్కరించకుండా కాలయాపన చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇకనైనా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం చేసి ఆదుకోవాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తోర్లపాటి బాబు, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు,ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు,భవన నిర్మాణ కార్మికులు జూపూడి వసంత,ఎస్.కె. సుభాని, బోడెం వెంకట్రావు,వాకా రామ్మోహన్రావు,తోట వెంకటరావు,పగడ ప్రసాద్, కే శివ,కురెళ్ళ వరప్రసాద్, తెర్లాపు శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని, పెండింగ్ లో ఉన్న 42,000 క్లైయిమ్స్ వెంటనే చెల్లించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు సెస్ రూపంలో జమవుతున్న సొమ్మును జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేయాని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఇసుక త్రవ్వకం ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వరాదని, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీఅధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ధర్నా, ఆందోళన కార్యక్రమాలను నిర్వహించి కలెక్టర్ చదలవాడ నాగరాణికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కోనాల భీమారావు మాట్లాడుతూ నూతన ఇసుక పాలసీ అక్రమార్కులకు వరంగా మారిందని, జగన్ సర్కారు హయాంలో జరిగిన తప్పిదాలే పునరావృతం అవుతున్నాయని మండిపడ్డారు. ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చి సిమెంట్,ఐరన్ ఇతర నిర్మాణ సామాగ్రి ధరలను నియంత్రించాలని కోనాల డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు, ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడుతూ తామేమీ బడ్జెట్ నిధులు కేటాయించాలని అడగడం లేదని తమ డబ్బులు తమకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో భవన నిర్మాణానికి సంబంధించి 32 వృత్తులు కుంటుపడ్డాయని, వేలాదిమంది ఆత్మ హత్యలు చేసుకున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు మరిన్ని పోరాటాలకు సిద్ధం అవుతామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, కళింగ లక్ష్మణరావు, తాడికొండ శ్రీనివాసరావు, ఎం.లక్ష్మీపతి, చేతి వృత్తి సంఘం జిల్లా నాయకులు ఎం.సీతారామప్రసాద్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జిల్లా కోశాధికారి ఏడిద వాసు, నాయకులు మైలవరపు శ్రీరాం బాబు, సర్వేశ్వరరావు, ఎం.హరీష్, మురళి కృష్ణ, రామకృష్ణ, సాయిబాబా, సుబ్రహ్మణ్యం, ఒ.వి.రాజు, గోపిరెడ్డి నాగబాబు, పడాల శ్రీనివాస్, ఎం.అనుకుమార్ జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాకినాడలో: ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ అనుబంధ సంఘం) కాకినాడ ఉపాధ్యక్షులు టి అన్నవరం అధ్యక్షతన సోమవారం కాకినాడ జిల్లా కలెక్టరేట్ కార్యాల యం వద్ద భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి ప్రదర్శన ప్రారంభమై ఇసుకను ప్రభుత్వమే సరఫరా చేయాలని, ఇసుక మాఫియా ను అరికట్టాలని, ఇసుకపై అధిక ధరలు నియంత్రించాలని నినాదాలతో కలెక్టరేట్కు చేరుకుంది. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పాలసీ ఇసుక విధానం అధికార పార్టీల వారికే అమలు జరుగుతుందని, ప్రజలకు అమలు చేయడంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇసుకపై అన్ని రాయితీల పన్నులు రద్దు చేస్తే భవన నిర్మాణ కార్మికులకు, సామాన్య ప్రజలకు, ఇంజనీర్స్కి, బిల్డర్స్కి, ఇసుక అందుబాటులో ఉంటుందని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి దొరుకుతుందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్ ఆందోళన ఉద్యమ కార్యచరణ మరింత పెంచుతామని ప్రసాద్ అన్నారు.

రాజమండ్రిలో: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక పాలసీ అధికార పార్టీ నేతలకు, దళారులకు ఉపయోగ పడుతుందని, ప్రజలకు మేలు జరగడం లేదని ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు విమర్శించారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ అనుబంధ సంఘం) జిల్లా అధ్యక్షులు పందేళ్ళ ధాను ప్రసాద్ నాయకత్వంలో స్థానిక కలెక్టరేట్ వద్ద వందలాది మంది భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముందుగా ప్రదర్శన చేశారు. ఇసుకను ప్రభుత్వమే సరఫరా చేయాలని, ఇసుక మాఫియాను అరికట్టాలని, ఇసుకపై అధిక ధరలు నియంత్రించాలని, సంక్షేమ బోర్డును పున: ప్రారంభం చేయాలని నినాదాలు చేశారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పాలసీ ఇసుక విధానం అధికార పార్టీల వారికే అమలు జరుగుతుందని, ప్రజలకు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇసుకను దోపిడీ చేస్తున్న దోపిడీ దళారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మధు డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలకు సైతం ఇసుక దొరకడం లేదని, ఒక యూనిట్ ధర 5000 నుండి10000 వరకు అమ్మకం చేస్తున్నారని, ఇసుక ఆన్లైన్ కన్నా ఆఫ్లైన్ మార్కెటింగ్ అధికంగా జరుగుతుందని,ఇసుకను అధికార పార్టీల వారు నిలువు దోపిడీ చేయడం వల్ల ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు పనులు లేక రోడ్లు పాలై , అప్పుల పాలై,ఆర్థిక ఇబ్బందులకు, గురి అవుతున్నారన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు పందేళ్ళ భాను ప్రసాద్ మాట్లాడుతూ ఇసుకను దోపిడీ చేస్తున్న దోపిడీ దళారులను అరికట్టి, ఇసుక నిల్వ స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని, ఇసుకను భద్రత యూనియన్ లకు అప్పగించాలని ఇసుకపై అధిక ధరలు నియంత్రించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె రాంబాబు, యూనియన్ జిల్లా కార్యదర్శి వి. మహేష్ బాబు, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని,కన్స్ట్రక్షన్ రంగంలో వసూలు చేస్తున్న 1 శాతం సెస్ నిధులు భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్ ఆందోళన ఉద్యమ కార్యచరణ మరింత పెంచుతామని ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చయ్య నాయుడు, శ్యామల రామకృష్ణ, మల్లయ్య పేట సత్యనారాయణ, సీపీఐ నగర కార్యదర్శి వి కొండలరావు, జే సాయిబాబా కోల సురేష్ , జట్లసంఘము కార్యదర్శి సప్పరమణ, మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ లావణ్య, కన్నయ్య, కొండలరావు, ఇతర కార్మిక సంఘాల నేతలుతదితరులు ప్రసంగించారు

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

విశాలాంధ్ర-లింగపాలెం: ఓటర్ల చేర్పులు మార్పులపై లింకపాలెం మండలంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరాన్ని డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి పరిశీలించారు. లింగపాలెం మండలంలోని ధర్మాజీ గూడెంలో పోలింగ్ కేంద్రాలను సందర్శించి సిబ్బంది

నుంచి వివరాలు తెలుసు కున్నారు.ఓట ర్ల మార్పులు,చేర్పులపై జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.మృతి చెందినవారివి, గ్రామాలను విడిచి వెళ్లినవారి ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించాలని తెలిపారు.అర్హులైన వారిని ఓటర్లలగా నమోదు చేసుకోవాలని, జాబితాలో పొరపాటులను సవరించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి వాస్తవాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఈయనతో పాటు ఉప తహసీల్దార్ ప్రసాదు, సర్వే డిప్యూటీ తహసిల్దార్ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు బిడ్డ నేత్రదానం

పలువురి అభినందనలు

విశాలాంధ్ర- భీమడోలు: ఏలూరు జిల్లా భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన ప్రముఖ రైతు బిడ్డ మొగళ్ళ పాండు రంగ విఠల్ కొండల రాయుడు (64) మరణానంతరం నేత్రదానం చేశారు. హైదరాబాద్కు చెందిన అమ్మా నేత్ర, అవయువ, శరీర దానం ప్రోత్సాహక సంఘం ఏలూరు జిల్లా కో ఆర్డినేటర్ టి. సుమన్ బాబు ప్రోత్సాహంతో మొగళ్ళ

పాండు కుటుంబ సభ్యులు అంగీకారంతో సోమవారం నేత్ర దానం చేశారు. ప్రముఖ కంటి శస్త్రచికిత్స వైద్య సంస్థ అయిన ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ సిబ్బంది స్థానిక నిడదవోలు రామాయమ్మ ఇంటర్నేషనల్ ఐ బ్యాంక్ సిబ్బంది ఈమేరకు రెటీనా సేకరించారు.ఈసందర్భంగా జిల్లా కో ఆర్డినేటర్ సుమన్ బాబు మాట్లాడుతూ పాండు రంగ విఠల్ ఆశయం ఎందరికో స్ఫూర్తి దాయకం అని సహరించిన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మరణానంతరం మనిషిని కాలిస్తే బూడిద అవుతుం దని పాతిపెడితే మట్టిలో కలిసిపోతారని సమాజం పట్ల బాధ్యత కలిగిన ప్రతీఒక్కరూ నేత్రదానం,అవయువ దానం, శరీర దానం చేయటానికి ముందుకు రావాలని సుమన్ బాబు కోరారు.పాండు రంగ విఠల్ నేత్ర దానం చేయటం పట్ల పలువురు అభినందించారు.

గ్రంథాలయ వారోత్సవాల కరపత్రం విడుదల

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: 57 వ గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతం చేయాలని పలువురు పేర్కొన్నారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథా లయంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయా ధికారి వానపల్లి శ్రీనివాసరావు గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలు విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల14నుండి20 వరకు వారోత్సవాల కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ , తల్లిదండ్రులు పోటీలలో చిన్నారులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గరికిపాటి బాపయ్య శర్మ, ప్రత్తి వీరస్వామి, వి. జాన్ బాబు, ఎన్. సత్యం, వెంకట్, జయప్రద, తనూజ, జె ప్రేమకుమార్, ఏ. జనార్ధన రావు, షేక్ మున్ని, పి. నాగ కమల, ఏ. వి. లక్ష్మణరావు, డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్లో సామాన్య ప్రజలకు అన్యాయం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులు అంకెల గారడీలతో ప్రజలను భ్రమల్లో ఉంచే ప్రయత్నం చేస్తోందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు విమర్శించారు. విపరీతంగా పెరిగిన ధరలతో సామాన్యులు, పేద ప్రజలు విలవిలలాడిపోతూ ఉంటే కనీసం ధరల ఊసే ఎత్తకుండా ప్రభుత్వం మౌనం పాటిస్తున్నదని దుయ్యబట్టారు. బడుగు వర్గాలకు కూడా అరకొర కేటాయింపులు చేసి, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, బీసీ సబ్ ప్లాన్ కేటాయింపులు లేకుండా ఎన్నికల హామీలు నీరుగార్చేసి మోసం చేశారన్నారు. వ్యవసాయ రంగానికి 11 వేల కోట్లు చాలీచాలని నిధులు కేటాయించి రైతులను, కౌలు రైతులను దారుణంగా అవమానించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది పేదలు ఇళ్ళ స్థలాలు కోసం నిరీక్షిస్తుంటే కేవలం ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక లక్ష 79 వేల గృహాలు మాత్రమే మంజూరు చేయాలని గృహనిర్మాణ శాఖ ప్రతిపాదనలు చేయడం సిగ్గుచేట న్నారు. కార్మికులు, కర్షకులు, అసంఘటిత రంగ కార్మికులు, భవన నిర్మాణ రంగ కార్మికులు, చిన్న తరహా ఉద్యోగుల సంక్షేమం గురించి ప్రస్తావన లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల కాలంలోనే దారుణమైన ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్న ఈ దగా కూటమి ప్రభుత్వంపై రాబోవు రోజుల్లో ప్రజలను సమీకరించి నిరంతర పోరాటాలు చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిగా మధు

పలువురి హర్షం

విశాలాంధ్ర - వేలేరుపాడు : ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిగా స్థానికుడు ఎర్ర మధు ఎన్నికవ్వటంపై పలువురు నాయకులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. అంచెలంచెలుగా ఎదుగుతూ జిల్లా కార్యదర్శి స్థాయికి వెళ్ళటం ఎంతో గర్వించదగ్గ విషయం అన్నారు. కష్టపడి పని చేసేవారు ఉన్నత స్థాయికి ఎదుగుతారు అనడానికి ఇదో నిదర్శనం అన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కార్యవర్గ సభ్యులు సస్నేపల్లి సాయిబాబు, మండల కార్యదర్శి బాడిస రాము, రామవరం సర్పంచ్ పిట్ట ప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కురిమెళ్ళ వెంకటేశ్వరరావు, మడివి కామయ్య, పెద్ద వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి బంధం నాగేశ్వరావు తదితరులు ఆకాంక్షించారు.

ప్రతిపక్ష హోదానా, ప్రజా సమస్యలా, ఏది ముఖ్యం?

మాజీ సీఎంపై యూత్ కాంగ్రెస్ నాయకుడి ఫైర్

విశాలాంధ్ర-నూజివీడుటౌన్: ఆడ లేక మద్దెల ఓడు అన్న చందంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తంతు కనిపిస్తుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోళ్ళ పవన్ కుమార్ వ్యాఖ్యానించారు. నూజివీడు పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వార్షిక బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్న అసెంబ్లీకి బాధ్యతయుతంగా హాజరు కాకుండా మైకు ఇవ్వలేదనో... తనకు సమయం ఇవ్వరనో, ప్రతిపక్ష హోదా ఇవ్వటం లేదనో ఆరుబయట పాత్రికేయుల సమావేశాలు నిర్వహించటం సబబు కాదన్నారు. ఓటమిపాలైన వైయస్ జగన్ వెంట 40 శాతం మంది బలమైన ఓటర్లు ఉన్నారనే నిజం గ్రహించాలన్నారు చంద్రబాబు, పవన్, జగన్ ఎవరు ముఖ్యమంత్రి పీఠం ఎక్కినా కేంద్రంలో మోడీ జపం చేస్తూ నేరుగా బిజెపి పాలన కొనసాగుతుందని అర్థమవుతుందన్నారు. ఇలాంటి కుట్రల కుయుక్తుల పాలన అంతమొందించేందుకు యువ నేత రాహుల్ గాంధీ కంకణం కట్టుకొని దేశం మొత్తం పర్యటిస్తున్నట్లు చెప్పారు. రానున్నది కేంద్ర రాష్ట్రాలలో తమ కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.

ఏజెన్సీ పేదలకు 3 సెంట్ల ఇళ్లస్థలం మంజూరు చేయాలి

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం:ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటున్న పేదలకు 3 సెంట్ల ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని పోలవరం నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కారం దారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ మండల నాయకులు బేతి కిషోర్ అధ్యక్షతన సీపీఐ శ్రేణులతో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి కారం దారయ్య మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో అనేక సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయని, రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ, మరుగుదొడ్లు, పక్కా గృహాలు లేక అనేకమంది గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మసిపూసి మారేడు కాయ చేస్తుందని విమర్శించారు. జీవో నెంబర్3 ను పటిష్టంగా అమలు చేసి గిరిజనులకు మేలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బేతి కిషోర్,కట్టం వెంకటేశ్వర్లు, కొమరం మల్లేశ్వరరావు,మడకం దుర్గారావు, తెల్లం వీరమ్మ , గుండి నాగరత్నం, బుద్దుల ముత్యాలమ్మ, సూర్యచంద్రం, పూణెం మంగారావు, కృష్ణ శ్రీనివాస్, రమణ, మోహన్,తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం పోరాటానికి వ్యవసాయ అధికారి స్పందన

విశాలాంధ్ర-చాట్రాయి: రైతు సంఘం పోరాట ఫలితంగా జిల్లా వ్యవసాయ అధికారి భాష చిన్నంపేట గ్రామానికి వచ్చి రైతాంగ సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఇటీవల ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిన్నంపేట గ్రామంలో సిపిఐ అనుబంధ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య, రైతు సంఘం జిల్లా నాయ కులు నిమ్మగడ్డ నరసింహ చందంపేట గ్రామంలో ఎస్సైన్డ్ భూముల రైతులకు ఈక్రాప్ పంట నమోదు చేయాలని, సహకార సంఘాలలో ఎస్సైన్డ్ భూముల రైతులకు సభ్యత్వ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేసిన నేపథ్యంలో దానిపై స్పందించిన ఏలూరు జిల్లా వ్యవసాయ అధికారి భాష సోమవారం చిన్నంపేట రైతు సేవ కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం చాట్రాయి మండల కార్యదర్శి కొమ్ము ఆనందం మాట్లాడుతూ రైతు సేవ కేంద్రంలో అధికారిగా పనిచేస్తున్న ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. వాస్తవాలను గుర్తించిన జిల్లా వ్యవసాయ అధికారి అధికారి పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. చిన్న రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగద న్నారు. చిన్న చిన్న వారికి ప్రభుత్వ సేవ లను అందించడమే ప్రధానమైన బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్ర మంలో మండల వ్యవసాయ అధికారి బి. శివ శంకర్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు పరసా వెంకటేశ్వరరావు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు కందుకూరి అప్పారావు, చిన్నంకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను పరిష్కరించాలి

విశాలాంధ్ర -భీమవరం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చే వినతులకు పరిష్కారం చూపడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, రీ ఓపెన్ కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి కలెక్టర్ వినతులను స్వీకరించి, అధికారు లకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. గత వారం అందిన ఫిర్యాదుల పరిష్కారం, తాజా పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించే వినతులను సంబంధిత శాఖల అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి చర్యలు చేపట్టాలని, ఒక వేళ ఫిర్యాదు ఒకటి కంటే ఎక్కువ శాఖలకు సంబంధించి ఉంటే సమన్వయంతో వ్యవహ రించి నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు తరలిన నేతలు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్దరించాలని, పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లైములను పరిష్కరించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను కార్మికులకు మాత్రమే వినియోగిం చాలని, కోరుతూ సోమవారం రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం, ఏఐటియుసి పిలుపు మేరకు స్థానిక సిపాయిపేటలో గల తాడేపల్లిగూడెం భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్య క్షులు దువ్వ శ్రీనివాస్ ఆధ్వర్యంలో యూనియన్ కమిటీ సభ్యులు, ఏఐటీయూసీ ఏరియా కమిటీ నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున భీమవరం కలెక్టర్ కార్యాలయానికి తరలి వెళ్లి ధర్నాలో పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌లో 236 అర్జీల స్వీకరణ

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అందిన ఫిర్యాదుల పరిష్కా రాన్ని నిర్దీత కాలవ్యవధిలో నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 236 దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, ఆర్డిఓ అచ్యుత అంబరీష్, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, డిప్యూటీ కలెక్టర్లు, భాస్కరరావు, మున్సిపల్ కమీషనరు ఎ. భానుప్రతాప్ లతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ సమస్యలపై వేదికనుంచే జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ కె. వెట్రిసెల్వి డివిజన్, మండలస్థాయి అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశించారు. ఆయా సమస్యలపై వేగంగా స్పందించి పరిష్కారం చూపాలన్నారు.

సమాచార హక్కుచట్టంపై అవగాహన

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లో రైతు గ్రూపులకు, రైతులకు సమాచార హక్కుచట్టం అవగాహన కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ మండలాల్లో వ్యవ సాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమాచార హక్కుచట్టం-2005 అవగాహన కార్యక్రమా లకు సంబంధించి ఫోటోలు, ప్రచురణలతో రూపొందించిన సావనీర్‌ను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్‌బాషా మాట్లాడుతూ సమాచార హక్కుచట్టం-2005 కమిషనరు వారి ఆదేశాల మేరకు జిల్లాలో మండలస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సంబంధిత డాక్యుమెంటేషన్ కమిషనరు వారి కార్యాలయానికి సమర్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి,జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ భాషా,డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల

విశాలాంధ్ర- ఉండి : ఉండి గ్రామం పెద్దపేటలోని ఎంపీపీ స్కూలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్వాంగ సుందరంగా స్కూలు ఆవరణం మొత్తం బొండు ఇసుక చుట్టూ ఐరన్ ఫినిషింగ్‌తో చెట్లు మొక్కలతో ఆహ్లాదకరంగా చూపరులకు దర్శనమిస్తున్నది. స్కూల్ టీచర్ కలిదిండి బంగారం విజ్ఞప్తి మేరకు ఉండి గ్రామం పెదపేట నివాసి దాత చిట్టూరి శ్యాంసన్ తన భార్య చిట్టూరి ఇందిర జ్ఞాపకార్థం బొండు ఇసుక వేయించి ప్రహరీ నిర్మాణం కొరకు స్కూలు చుట్టూ ఐరన్ ఫినిషింగ్ వేయించారు. ఈ ఫినిషింగ్ పట్ల స్కూల్లోని పిల్లల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ టీచర్ కలిదిండి బంగారం మాట్లాడుతూ విద్యార్థులు వర్షాలు వచ్చినప్పుడు మురుగునీటిలో రావలసి వస్తుందని, మార్గం వేయించమని శ్యాం సన్ ను కోరగా గ్రౌండ్ మొత్తం బొండు ఇసుక వేసి ఫినిషింగ్ వేయడానికి అయ్యే ఖర్చు తానే భరిస్తానని టీచర్ కు చెప్పి వెంటనే పనులు చేయించారు. దాత శ్యాంసన్‌ను, టీచర్ బంగారంను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

భీమవరం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నెం.12(1744533)/2019/డి.బి. తేది:11-11-2024

భీమవరం పురపాలక సంఘ పట్టణ పరిధి పురపాలక సంఘములో **షార్టు టెండరు నోటీసు నెం.17(1-6)/BHI/General/2024-25/E1/E2** లోని జనరల్ ఫండ్స్ నుండి 6 పనులకు సంబంధించి రూ.**53.02** లక్షలకు గాను ఇ-ప్రోక్యూరుమెంటు ద్వారా టెండర్లు జి.వో.ఎమ్.ఎస్ నెం: 94 లేక దానిపై ఇతర అనుబంధ జి.వోల ప్రకారం రిజిస్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుచున్నవి. మిగిలిన వివరములు ఇప్రోక్యూరుమెంటు మార్కెట్టు www.tender.apeprocurement.gov.in లేదా కమీషనరు, భీమవరం పురపాలక సంఘం, ప.గో.జిల్లా (సెల్: **9849906540, 9849906543**) వారిని సంప్రదించగలరు.

కమీషనరు,
భీమవరం పురపాలక సంఘం

డ్రైనేజీ, రోడ్డు నిర్మించండి

విశాలాంధ్ర-ఉంగుటూరు : డ్రైనేజీ, రోడ్డు లేకపోవడంతో వర్షం నీరు ఇళ్లలోకి వస్తున్నదని ఉంగుటూరు మండలం కైకరం పడమర వీధి మహిళలు వాపోయారు. సోమవారం ఉంగుటూరు ఎంపీడీవో గంజి రాజ్ మనోజ్‌కు మహిళలు తమ సమస్యలను వివరించారు. ఎప్పటినుంచో ఈ సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవటం లేదని మహిళలు ఎంపీడీవో వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. మీ గ్రామం వచ్చి సమస్యను పరిశీలిస్తానని, దీనికి మీరు సహకరించాలని ఎంపీడీవో సూచించారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని, మానవతా సంస్థ అధ్యక్షులు మాటూరి సుధీర్ పేర్కొన్నారు. మండలంలోని వంక బొత్తప్ప గూడెం గ్రామంలో వంక సత్యనారాయణ, వంక రంగారావు, కుంజ రామలక్ష్మికి చెందిన, మూడు తాటాకు ఇళ్లు ఇటీవల మూడు రోజుల క్రితం అగ్ని ప్రమాదానికి గురై, గృహ ఉపకరణాలతో సహా కాలిపోవడంతో, కట్టుబట్టలతో ఉన్న గిరిజన కుటుంబాల వారి పరిస్థితి తెలుసుకొని, కొయ్యలగూడెం మానవతా సంస్థ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, తొమ్మిది వేల రూపాయల నగదును బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి స్వచ్ఛంద సేవా సంస్థల వారు ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముప్పనాపల్లి. వెంకటేశ్వరరావు, సుబ్బారావు, వి ఎస్ ఎన్ స్వామి, మండపాటి .రామకృష్ణ, బొమ్మ మోహన్ రావు, చంటి, వీఆర్వో అడపా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు 1862 దరఖాస్తులు

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు నమోదుకు ఉంగుటూరు మండలం నుంచి 1,862 దరఖాస్తులు వచ్చాయని ఉంగుటూరు ఎన్నికల డీటీ పోతురాజు తెలిపారు. సోమవారం తాహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1,215 దరఖాస్తులు ఆన్‌లైన్లో వచ్చాయని, 647 ఆఫ్ లైన్లో వచ్చేయన్నారు. ఆఫ్లైన్లో వచ్చిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేసి పంపించినట్లు పోతురాజు తెలిపారు.

నీటి సంఘాల ఓటరు జాబితా ప్రచురణ

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలం ఏలూరు కాలువ పరిధిలోని ఏడు, జంక్షన్ కాలువ పరిధిలోని 2 నీటి వినియోగదారుల సంఘాలకు, 8 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు ఓటర్ లిస్టులను ప్రచురణ చేశామని తహశీల్దార్ ప్రసాద్ తెలిపారు. ఆ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయం, గ్రామ సచివాలయంలో ప్రచురణ చేసిన ఓటరు జాబితాను నోటీసు బోర్డుల్లో ఏర్పాటు చేశామన్నారు.

అబుల్‌కలాం ఆజాద్ జయంతి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలోని కుంతలగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం తొలి కేంద్ర విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ మాట్లాడుతూ భారతదేశంలో విద్యా,వికాసాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని బాల బాలికలకు తెలియజేశారు. ఈయన పుట్టినరోజునే జాతీయ విద్యా దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బాల బాలికలకు మిఠాయిలు పంచారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే.అమృత, ఎస్.రమేష్, కే. ఏసేపు బాల బాలికలు పాల్గొన్నారు.

రియల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: తాడేపల్లిగూడెం పట్టణం, చుట్టుపక్కల గ్రామాలను ఆనుకొని ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూములపై రియల్ ఎస్టేట్ మాఫియాను అరికట్టాలని ఎ.పి.వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కె.ఆర్.పురం ఐటీడీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డికి వ్యవసాయ కార్మిక సంఘం వినతి పత్రం అందచేసింది. ఈ సందర్భంగా కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పట్టణం, రూరల్ గ్రామాలైన పెదతాడేపల్లి, పడాల, కుంచనపల్లి, ప్రత్తిపాడు, పెంటపాడు, జట్లపాలెం, తాళ్ల ముదునూరి పాడు, దర్శిపర్రు, జువ్వలపాలెం, ఆరుగొలను గ్రామాలను ఆనుకొని ఉన్న పుంత పోరంబోకు, కాళ్లదారి, బండి దారి, పంట బోదులు, కుంటలు, ప్రభుత్వ చెరువులు, ప్రభుత్వ భూములు, ప్రైవేట్ చెరువులు, ప్రైవేటు భూములు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు అరాచకాలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటూ పాలకుల అండదండ లతో ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా, అమాయక ప్రజలకు మాయమాటలు చెప్పి స్థలాలు విక్రయిస్తున్నారని ఆరోపించారు. అక్రమ లే-అవుట్ల ఏర్పాటుకు రెవెన్యూ సిబ్బంది నుంచి మున్సిపల్ యంత్రాంగం వారి సహకారంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగుతుందని ఆయన వివరించారు. దీనికి కారకులైన రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగంపై 2000 సంవత్సరం నుండి నేటివరకు మేజిస్ట్రేట్ లేదా ప్రత్యేక అధికారిని నియమించి, విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను కాపాడాలని ఆయన కోరారు.

పట్టించుకోని ప్రభుత్వాలు

(1వ పేజీ తరువాయి)

మారటమే కానీ నిర్వాసిత జీవితాల్లో మార్పు లేదన్నారు. 2017 సంవత్సరంలో చేసిన సర్వే ఆధారంగా ప్యాకేజీలు వర్తింప చేస్తే యువత ఎంతో నష్టపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తరలించే నాటికి 18 సంవత్సరాల నిండి ఉన్న యువతకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. స్థానిక అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ అనర్హులుగా పేర్కొన్న నిర్వాసిత కుటుంబాలకు ప్యాకేజీ వర్తింప చేయాలన్నారు. ఇళ్ల నష్టపరిహారంలో జరిగిన అవకతవకలను వెంటనే సరిచేసి న్యాయం చేయాలన్నారు

విలీన మండలాల నిర్వాసితులతో మహాసదస్సు

ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన ఏడు మండలాల నిర్వాసితులతో డిసెంబర్10న ఎటపాకలో మహాసదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారం కొరకు ఎన్ని పోరాటాలు చేయటానికైనా భారత కమ్యూనిస్టు పార్టీ సిద్ధంగా ఉందన్నారు. నిర్వాసితులకు అండగా భవిష్యత్తులో చేయవలసిన పనులపై కార్యాచరణ జరుగుతుందన్నారు. ఈనెల 18న సిపిఐ మండల జనరల్ బాడీ సమావేశం ఉదయ నగర్ లో నిర్వహిస్తామని అక్కడే పలు నిర్ణయాలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గ్రామాల్లో ఉన్న సమస్యలపై ఆ శాఖ వారు దృష్టి సారించాలన్నారు.అనంతరం జిల్లా కార్యదర్శికి 300 మంది పార్టీ సభ్యత్వాన్ని మండల నాయకత్వం అందజేశారు.

నూతన గ్రామ శాఖ ఎన్నిక

సమావేశం అనంతరం బండ్లబోరు గ్రామ నూతన శాఖ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా తాటి దుర్గారావు, సహాయ కార్యదర్శిగా కట్టి రాంబాబు, సోడే రాజు, కోశాధికారిగా కరటం బొందలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి బాడిశ రాము, జిల్లా కౌన్సిల్ సభ్యులు పిట్టా ప్రసాద్, కురిమెళ్ళ వెంకటేశ్వర్లురావు,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యర్రా మధు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మడివి కామయ్య,పెర్ల వెంకటేశ్వర్లురావు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, నాయకులు కట్టి రాంబాబు, కారం ముత్యాలరావు, కాకా ముత్యాల రావు, కారటం బోండు, కాకా గంగా, కారం మంగా, వంగపండు తులసి తదితరులు పాల్గొన్నారు.

సాయం అందించాలి

(1వ పేజీ తరువాయి)

చెల్లించవలసిన సొమ్మును ప్రభుత్వమే చెల్లించి రైతులకు భీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులకు రూ.50 లక్షల నష్టపరి హారం చెల్లించాలన్నారు.రైతులకు నష్టపరిహారం చెల్లించి వెంటనే చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించాలన్నారు. చెరువుల పూడిక తీత పనులు చేయాలని కోరారు.విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం చింతలపూడి అధ్యక్షులు షేక్ కాలేషా, రైతు సంఘం మండల కమిటీ నాయకులు సిపిఐ చింతలపూడి మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సిపిఐ సీనియర్ నాయకులు జంగా రామచంద్రారెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

నూజివీడులో: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపుమేరకు సోమవారంనాడు నూజివీడులో రైతు సంఘం నాయకులు తహసీల్దారు సుబ్బారావుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు నిమ్మగడ్డ నరసింహం మాట్లాడుతూ విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలతో రైతులపై పేద ప్రజలపై 8 వేల కోట్లు భారం మోపటం మంచిది కాదని దీన్ని తక్షణమే రద్దు పరచాలని,స్మార్ట్ మీటర్ ఏర్పాటు కూడా రద్దు పరచాలని డిమాండ్తు తహసీల్దార్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియపరిచే ప్రయత్నాన్ని రాష్ట్ర రైతు సంఘం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి మదుపల్లి నాగేంద్రరావు, రైతు నాయకులు చాట్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా లేని రాష్ట్ర బడ్జెట్

విశాలాంధ్ర - ద్వారకాతిరుమల : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ పేదలకు ఆశాజనకంగా లేదని ద్వారకాతిరుమల మండల సిపిఐ మండల కార్యదర్శి గొలిమే బాలయేసు తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన ద్వారకా తిరుమలలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి సహాయ కార్యదర్శి మంద్రు బాలరాజు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా బాలయేసు మాట్లాడుతూ శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరుపేదలకు పూర్తి విరుద్ధంగా ఉందన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటికి ఐదులక్షలు ఇస్తానన్న హామీని పూర్తిగా తుంగలోకి తొక్కారని, సూపర్‌సిక్స్ పథకాలకు ఏమాత్రం నిధులు కేటాయించలేదన్నారు. ఏ కార్పోరేషన్‌కు నిధులు కేటాయించనప్పుడు కార్పోరేషన్‌లు ఎందుకని ఎద్దేవాచేశారు. అన్ని శాఖలకు నిధులు కేటాయించక పోతే గతప్రభుత్వానికి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ముంగమూరి జ్ఞానేసు, ఎడ్లపల్లి రమేష్, రేపూరి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫోటోతో ఐటమ్ పెట్టగలరు.

అత్యుత్తమ ప్రథమ ఉపాధ్యాయులుగా డాక్టర్ దేవానంద్ కుమార్

విశాలాంధ్ర - మండవల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 170 డిగ్రీ కాలేజీలకు, 2500 మంది డిగ్రీ కళాశాల అధ్యాపకులు పనిచేస్తుండగా వారిలో అత్యుత్తమ అధ్యాపకులను 19 మందిని ఎంపిక చేయగా మైలవరం డాక్టర్ ఎల్ హెచ్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ అధ్యాపకులుగా పనిచేస్తున్న డా. మెండా దేవానంద్ కుమార్ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచారు. మండవల్లి గ్రామానికి చెందిన మెండ హిజ్కియా, తెరిసా దంపతుల తృతీయ సంతానం డాక్టర్ మెండా దేవానంద్ కుమార్ కు కుటుంబ సభ్యులు మెండా సురేష్, గ్రామ సర్పంచ్ మెండా రూన్సీ, గ్రామస్తులు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.

కొత్తపల్లికి ఘన స్వాగతం

విశాలాంధ్ర-నరసాపురం : కూటమి ప్రభుత్వం తాజాగా ప్రకటించిన నామినేటెడ్ పదవులలో కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపి కైన కొత్తపల్లి సుబ్బారాయుడు సోమవారం తన సొంత నియోజకవర్గమైన నరసాపురానికి విచ్చేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి అభిమానులు జనసేన కార్యకర్తలు కూటమి నాయకులు భారీ ర్యాలీ తో ఆయనకు స్వాగతం పలికారు బాణాసంచా కాల్చులతో పూలు జల్లుతూ అంబేద్కర్ సెంటర్లో గజమాలతో త్కరించారు. కొత్తపల్లి స్వాగత ర్యాలీతో నర్సాపురం పట్టణంలో కోలా హలం నెలకొంది తమ నాయకుడికి కీలక పదవి దక్కడంతో కొత్తపల్లి అభిమానుల్లో సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్ర మంలో కొటిపల్లి వెంకటేశ్వర రావు, దొండపాటి స్వామి, గుగ్గిలపు మురళి,వన్నెంరెడ్డి శ్రీనివాస్,అధికారి కిరణ్, జనసేన నాయకులు,టిడిపి నాయకులు, కాపు సంఘం నాయకులు కొత్తపల్లి అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

ఏలూరుజిల్లా ముదినేపల్లి మండలం - మండవల్లి గ్రామ కాపురస్తురాలు వర్రె పాండురంగారావు గారి భార్య వర్రె అరుణకు చెందిన కైకలూరు మండలం రాచపట్నం గ్రామములోగల చ.గ.413.82లు గల నివేశన స్థలమును కైకలూరు రిసర్వే నం.లో డ.నెం. 383/2021రుగా రిజిష్ట్రేషన్ దస్తావేజును నేను చిగురుకోట నుండి మండవల్లి గ్రామములోగల మెయిన్ సెంటరు నందు వెహికల్‌పై వస్తుండగా జిరాక్స్ నిమిత్తము వెళ్లగా నా యొక్క దస్తావేజు నెం.383/2021రు ఒరిజినల్ మార్గమధ్యలో జారిపడిపోయినది. ఎవరికైనా దస్తావేజు దొరికినచో ఈ నం.9989124599కు తెలియచెయ్యగలరు.

బొడ్డు వెంకట రమణకు అభినందనలు

విశాలాంధ్ర - దేవరపల్లి : రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన బొడ్డువెంకట రమణ చౌదరిని దేవరపల్లి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆంధ్రు అనిల్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు ఉప్పులూరి రామారావు ఎలమాటి అక్కిరాజు పిన్నమణి నవీన్ ఓరిగంటి జగదీష్ రాజు సోమవార బొడ్డు అనంత వెంకటరమణ చౌదరిని కలిసి అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా దేవరపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ యువకుడైన వెంకటరమణ చౌదరిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆయన సామర్థ్యాన్ని గుర్తించి పదవి ఇచ్చారని అన్నారు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం పరిసర గ్రామీణ ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని ఆకాంక్షించారు అనంత వెంకటరమణ చౌదరిని నియమించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు ఆంధ్రు అనిల్ కృతజ్ఞతలు తెలియజేశారు

జనసేన సమన్వయ కమిటీ సభ్యుల ఎంపిక

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి జనసేన పార్టీ సమన్వయ కమిటీ సభ్యుల ఎంపిక గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి డి సువర్ణ రాజు సమక్షం లో సోమవారం జరిగింది. దేవరపల్లి జనసేన పార్టీ గ్రామ గౌరవ అధ్యక్షునిగా పసుపులేటి శివ నాగ ప్రసాద్ , సమన్వయ కమిటీ సభ్యులుగా కంబాల సత్తిబాబు, కొడమంచిలి శ్రీను, జాజి మొగ్గల శ్రీనివాస్, హనుమ రెడ్డి ఆంజనేయులు, మాధవరపు వెంకటేశ్వరరావు ఐదుగురితో కమిటీ ఏర్పడింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కట్నం గణేష్, సీనియర్ నాయకులు అనిశెట్టి గంగరాజు, మండల ఉపాధ్యక్షుడు చప్పటి శివ నాగ ప్రసాద్, గ్రామ జనసైనికులు పాల్గొన్నారు

టెన్నికాయిట్ పోటీలలో రామన్నపాలెం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా 68వ స్కూల్ గేమ్స్ టెన్నికాయిట్ పోటీలలో అండర్ 14 బాలికలు మొదటి స్థానం, అండర్14 బాలురు ద్వితీయ స్థానం, అండర్ 17 బాలికలు తృతీయ స్థానం సాధించినట్లు దేవరపల్లి మండలం రామన్నపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పేరం రవీంద్ర తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బాలికల విభాగంలో ఆర్ సంస్కృతి వై ఐశ్వర్య ఎం చంద్రిక, ఎం గంగ, జె సిరిపల్లిక , ఎస్.కె ప్రతిభ, ఎం లోహిత, ఎం ప్రియదర్శిని, బాలుర విభాగంలో వై ఈశ్వర్ జి బాబి, బి లక్ష్మణ్, ఎం సుశాంత్, టి దుర్గాప్రసాద్, ఎం సందీప్, విజయం సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర తెలిపారు ఈ నెల 9 10 తేదీలలో కర్నూలులో జరిగిన సపత్ తక్రా అండరు 17 విభాగంలో వై ఆంతోని ప్రథమ స్థానం సాధించారు. ఎం మహాలక్ష్మి ద్వితీయ స్థానం సాధించినట్లు రవీంద్ర తెలిపారు. విజయాలు సాధించిన క్రీడాకారులకు సోమవారం జరిగిన కార్యక్రమంలో స్వీట్లు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ పిడి సరస్వతి, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

పంచాయతీ కార్యదర్శికి ఘన నివాళులు

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంక గ్రామం లో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీలక్ష్మికి సంతాప సభ సోమవారం ఎంపిడిఓ భారతి ఆధ్వర్యంలో జరిగింది. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న హాజరయ్యి ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మంచి వ్యక్తిత్వం బాధ్యత కలిగిన ఒక మంచి మనిషిని కోల్పోవడం దురదృష్టం కరం అని అన్నారు. అలాగే ఆమె పవిత్ర ఆత్మ శాంతి చేకూరాలని ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ మనోధైర్యం కలగాలని కోరుతు న్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శివ గోపాల్, కంప్యూటర్ అసిస్టెంట్లు సతీష్, జగదీష్, లక్ష్మణ్, అన్ని గ్రామాల కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ నివారణకు అవగాహన కార్యక్రమాలు

గోడపత్రిక ఆవిష్కరణలో కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : కేన్సర్ నివారణకు ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి వైద్య సిబ్బందికి. సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశమందిరంలో పీజీ ఆర్ ఎస్ కార్యక్రమం అనంతరం జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో 14 నవంబర్ నుండి ఇంటి వద్దనే ఉచితంగా కేన్సర్ పరీక్షలు సంబంధించిన గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 14 తారీకు నుండి జిల్లాలో ఎన్.సి.డి 3.0 కార్యక్రమం మొదల వుతుందని అందులో భాగంగా ప్రజలకు షుగర్, బీపీ, మరియు నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, అలాగే గర్భాశయం ముఖ క్యాన్సర్ సంబంధించి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చు అన్నారు. ప్రజలు కూడా అందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేన్సర్ పై విజయం స్క్రీనింగ్ తోనే సాధ్య అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపామన్నారు. ఈ సర్వే లో ప్రతి ఇంటికి 18 సంవత్సరాలు పైబడిన వారికి ఎత్తు, బరువు, తో పాటు బీపీ షుగర్ పరీక్షలు అలాగే క్యాన్సర్ సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. అనంతరం ఆర్ బి ఎస్ కే లోని చైల్డ్ స్క్రీనింగ్ సంబంధించి హెల్త్ కార్డును జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. న్యుమోనియా వ్యాధి లక్షణముల పట్ల తల్లి తండ్రులకు అవగాహన కల్పించడం తద్వారా న్యుమోనియా వ్యాధి వల్ల కలిగే మరణాలను తగ్గించడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ న్యుమోనియా 0-5 సంవత్సరముల పిల్లల్లో వచ్చే శ్వాస కోశ వ్యాధి , ఊపిరి తిత్తుల వ్యాధి అని తెలియ జేసారు పిల్లల్లో న్యుమోనియా లక్షణములు గుర్తించి వారికీ చికిత్స చేయడం , అవసరం అయిన వారికి పి హెచ్ సి లలో చికిత్స చేయడం జరుగుతుందని, ప్రమాదకర లక్షణములు ఉన్న వారిని గుర్తించి సి హెచ్‌సి ఏరియా ఆసుపత్రి , జిల్లా ఆసుపత్రులకు పంపి చికిత్స చేయడం జరుగుతుందని తెలియజేసారు. జాయింట్ కలెక్టర్ ఎస్ . చిన్న రాముడు, డిఆర్ ఓ టి. శ్రీరామ చంద్రమూర్తి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ పద్మశ్రీ , జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర , ఎపిడిమిలాజిస్ట్ సుధీర్ మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహనీయుల జీవిత విశేషాలు విద్యార్థులకు మార్గదర్శకాలు

విశాలాంధ్ర -సీతానగరం: మహనీయుల జీవిత విశేషాలు విద్యార్థులకు మార్గదర్శకాలు అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి చిట్టి బాబు అన్నారు. సీతానగరం గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్‌పిఓ సుధామాయి ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ చిట్టిబాబు ముఖ్య అతిథిగా భారత ప్రథమ విద్యాశాఖ మంత్రి శ్రీ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చిట్టిబాబు మాట్లాడుతూ ఎందరో మహానుభావులు స్వాతంత్రం వచ్చాకా కూడా నిస్వార్ధంగా ప్రజా సేవా చేస్తూ నేటి తరానికి ఆదర్శంగా నిలిచారు అని అన్నారు. అలాగే వైస్ ప్రిన్సిపాల్ హరేరామ కృష్ణ మాట్లాడుతూ ఆజాద్ మహోన్నత వ్యక్తి అని అన్నారు. ఆయనే విద్యాశాఖ మంత్రిగా అనేక మార్పులతో విద్యాశాఖ అభివృద్ధికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నాగేశ్వరావు, సుబ్బారావు, మాధవ్, వెంకటేష్, వాణి, అలేఖ్య, రాజేశ్వరి, శివ దుర్గా, ఫణీంద్ర కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధన మన సంప్రదాయం

విశాలాంధ్ర - కడియం : ఉసిరిచెట్ల పూజలు, చిన్నారుల ఆట పాటలు, పెద్దల ఆత్మీయ పలకరింపులు, కష్ట నష్టాలు, సుఖ సంతోషాలు అనుభూతులు వెరసి కేరింతల మధ్య కడియం మండలం కడియపులంక శ్రీ ఈశ్వరి ఫామ్స్ నర్సరీలో కార్తీక వన సమారాధన సాంప్రదాయ పద్ధతిలో జరిగింది. ఉదయం ఉసిరిచెట్ల పూజలు, శివారాధనను టీవీసీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తడాల విష్ణు చక్రవర్తి, రాజారాజేశ్వరి దంపతులు, కుటుంబ సభ్యులతో శాస్త్రుతంగా పూజలు నిర్వహించారు. ఇలా కుటుంబసభ్యులతో కలిసి అందరూ ఒకే చోట ఇలా ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్తిక వన సమారాధనలో పాల్గొని సంతోషంగా ఉందని విష్ణు చక్రవర్తి మాతృమూర్తి ముత్యాలమ్మ అన్నారు. విష్ణు చక్రవర్తి స్వీయ నిధులతో ఏర్పాటు చేసిన ఈ వన సమారాధనకు వందలాది మంది నర్సరీ రైతులు, స్థానిక ప్రజ లు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అబుల్ కలామ్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జనాబ్ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జన్మదిన వేడుకలు ముఖ్య అతిథిగా డి ఆర్ వో, ఇతర మైనార్టీ అధికారులు, సంఘాల ప్రతినిధులు , మైనార్టీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ, 1948 నుంచి 1958 వరకు 10 సంవత్సరాలు పాటు కేంద్ర విద్యా శాఖ మంత్రి గా ఆయన అందించిన మార్గనిర్దేశం నేటికీ సమర్థవంతంగా అమలు చేస్తున్న తీరే నిదర్శనం అన్నారు. ఆనాడే భారతదేశానికి ఐఐటిలలో గొప్ప భవిష్యత్తును ముందే ఊహించి, దేశ విద్యా ప్రమాణాలు అభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన మరణం తరువాత ఆయన సేవలకు గుర్తింపుగా 1992 లో భారత ప్రభుత్వం భారత రత్న అవార్డుతో సత్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సునీల్ కుమార్, మైనార్టీ ప్రతినిధులు ఎస్ కె అసాదుల్లా అహమ్మద్, ఎస్కె అబుల్ కవీన్, ఎండీ అబుల్ రజ్జాక్, శ్రీనివాస్, ముస్లిం , క్రిస్టియన్ సంఘాల మత గురువు లు , తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలి

ఆర్డీవో కృష్ణ నాయక్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "పి జి ఆర్ ఎస్ - మీ కోసం" వేదికలో వచ్చిన అర్జీలను డివిజన్ స్థాయి అధి కారులతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పి జిఆర్ఎస్-మీకోసం" ద్వారా ప్రజల నుంచి 8 అర్జీలను స్వీకరించామన్నారు. ప్రతి అర్జీని నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించి దరఖాస్తుదానికి న్యాయం చేయాలని అధికారులకు సూచించారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన

విశాలాంధ్ర - కొవ్వూరు : ఎస్సీ ఎస్టీలపై జరుగుతున్న నేరాలు గురించి వాటి నుంచి చట్టరీత్యా వారికీ ఎలా రక్షణ లభిస్తుందో తెలియజేయడం కోసం ఈ అవగాహన సదస్సు నిర్వహించినట్టు అస్మా ఫర్హీన్ అన్నారు. స్థానిక కొవ్వూరు పట్టణం శ్రీ సుందర సాయి కళ్యాణ మండపంలోని ఆంధ్రప్రదేశ్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ చట్టం గురించి, స్వతంత్రం తర్వాత ప్రభుత్వం సమాజంలోని అంటరానితనాన్ని నిర్మూలనపై అట్రాసిటీ యాట్ గురించి చట్టపరిధిలో జరిగిన నేరాల గురించి అవగాహన కల్పించారు. ఆన్లైన్ ఎక్సమ్ పెట్టి అందులో అత్యధిక మార్కులు వచ్చిన వారికి మెమొంటోలను అడిషనల్ ఎస్పీ సిఐడి రాజమండ్రి వారు బహూకరించారు. ఈ సదస్సులో ప్రసంగించిన వక్తల అందరిని అడిషనల్ ఎస్పీ సిఐడి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జయరాజు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, భీష్మ గంగేడు రిటైర్డ్ అదనపు జిల్లా న్యాయమూర్తి సందీప్, డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్, సాల్మన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్ టచ్ గుడ్ టచ్‌పై అవగాహన

విశాలాంధ్ర - అమలాపురం : శిరంగు రంగనాయకమ్మ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉప్పలగుప్తం మండలం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రాజేష్ పాఠశాలలోని విద్యార్థులకు మహిళా సంరక్షణ గుర్పి కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఆడపిల్లలకు గుడ్ టచ్ బాడ్ టచ, ఆధునిక కాలంలో ఆడపిల్లలు ఏ విధముగా మీడియాకు బానిసలై జీవితాలు పాడు చేసుకుంటున్నారో తెలిపారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. చిన్న చిన్న విషయాలకు ఆందోళన చెంది ఆత్మహత్య చేసుకోకుండా ప్రాణాన్ని నిలుపుకొని జీవితానికి అర్థం తేవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూకల సత్యనారాయణ, స్టాఫ్ సెక్రటరీ అర్హా స్వామినాయుడు, పిడి కామన్ మధు, రాయి వెంకటేశ్వరరావు, పెండ్యాల శ్రీనివాసరావు, మహిళా పోలీసులు శాంతి, మౌనిక, సత్య పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్

విశాలాంధ్ర - కాకినాడ : 2024-25 రాష్ట్ర వార్షిక బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో ప్రాధాన్యతనిస్తూ ప్రజల అవసరాలకు దగ్గరగా ఉందని మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పై రమణయ్యపేటలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రూ.2.94 లక్షల కోట్లతో వార్షిక బడ్జెట్ శాసన సభలో ప్రవేశపెట్టారని అన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పి స్తూ ఆదాయార్జన మార్గాలు చూపి సర్వతోముఖాభివృద్ధి సాధించే దిశగా ప్రభు త్వ కేటాయింపులు ఉన్నాయని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే రీతిలో బడ్జెట్ ఉందని అన్నారు. ఎన్నికలలో హామీ నిచ్చిన మేరకు సూపర్ సిక్స్ పథ కాలకు నిధుల కేటాయింపు జరిగిందన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభి వృద్ధి శాఖకు 16 వేల 739 కోట్లు కేటాయించడం మంచి పరిణామం అని అన్నారు. గ్రామాలలో రోడ్ల అభివృద్ధి చెందుతాయని అడబాల తెలిపారు.

తిండైనా పెట్టండి జైల్లోనైనా పెట్టండి..
కదం తొక్కిన హాస్టల్ విద్యార్థులు

విశాలాంధ్ర - రాజోలు : హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాజోలు జిల్లా పరిషత్ పాఠశాల నుండి విద్యార్థులు తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తహశీల్దారు కార్యాలయం వద్ద హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. తిండైనా పెట్టండి జైల్లోనైనా పెట్టండి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఆరు నెలల నుండి ఎస్సీ, బీసీ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు విడుదల చేయకపోవడంతో సిబ్బంది అప్పులు చేసి విద్యార్థులకు అన్నం పెడుతున్నారు. రాజోలు బీసీ హాస్టల్‌లో అయితే హాస్టల్ వార్డెన్‌కు కూడా జీతాలు రాకపోవడంతో భోజనాలు సరిగా పెట్టలేక పోతున్నారు. ఉదయం సాయంత్రం కూడా పెరుగ అన్నం మాత్రమే పెట్టగలుగుతున్నారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ అధికారుల నిర్లక్ష్యంతో ఎస్సీ, బీసీ హాస్టల్ విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు అన్నారు. రాజోలులో శిధిలావస్థకు చేరిన హాస్టల్ భవనాలలో విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ బ్రతుకుతున్నారు. గర్ల్స్ హాస్టల్‌లో అయితే మరుగుదొడ్లకు కనీసం తలుపులు కూడా లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి సౌకర్యం కూడా అంతంత మాత్రంగానే ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మెస్ చార్జీ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి సాంఘిక సంక్షేమ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సాధ్యమైనంత త్వరలో మెస్ చార్జీ బిల్లులను విడుదల చేయాలని లేని పక్షంలో అన్ని విద్యార్థి సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రం తహశీల్దారు ప్రసాదుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాజోలు నియోజకవర్గ ఇన్ చార్జ్ నక్క సంజయ్, జిల్లా సహాయ కార్యదర్శి రషీద్, పోలిశెట్టి గణేష్, తాడి రవీంద్ర పాల్గొన్నారు.

అబుల్ కలాం సేవలు చిరస్మరణీయం
కలెక్టర్ షణ్మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : స్వతంత్ర సమరయోధుడిగా, భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ షణ్మోహన్..ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులతో కలిసి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లాలోని ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్, ఇతర మత పెద్దలు సత్కరించారు. ఉర్దూ వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ అబుల్ కలాం దేశానికి అందించిన సేవలకు గుర్తుగా ఆయన పుట్టిన రోజును ప్రతి సంవత్సరం జాతీయ విద్యా దినోత్సవంగా, మైనారిటీ సంక్షేమ దినోత్సవంగా దేశ మొత్తం జరుపుకుంటు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనా రిటీ సంక్షేమ శాఖ అధికారి ఎం సునిల్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి పి రమేష్, అడల్ట్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి వి త్రిమూర్తులు, ముస్లిం ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండీ జవహర్ ఆలీ, ముస్లిం అడ్వకేట్ అసోసియేషన్ సభ్యులు సైయద్ద్ సాలార్, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు, మైనారిటీ సంక్షేమ శాఖ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

భూ రీసర్వే సదస్సుల్లో 18 అర్జీలు

విశాలాంధ్ర - కరప : కరప మండలం గురజనపల్లి గ్రామంలో భూ రీ సర్వే సదస్సులు నిర్వహించటం జరిగిందని తాసిల్దార్ ఎన్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో రైతులు పాల్గొని 18 అర్జీలు అందించారని ఆయన తెలిపారు. భూ వివరాలు సక్రమంగా లేకపోవడంతో వాటిపై సర్వే చేయించాలని, పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇప్పించాలని అర్జీల్లో పేర్కొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్, ఆర్ఐ, మండల సర్వేయర్, గ్రామ రెవిన్యూ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - ఆలమూరు : ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమి రెడ్డి లక్ష్మీ లావణ్య అన్నారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆలమూరు మండలంలోని 18 గ్రామాల్లో 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని, రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చినట్లయితే ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ. 2300 ధర పలుకుతుందన్నారు. గత సీజన్ కంటే క్వింటాకు రూ. 117 మద్దతు ధర పెరిగిందని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కొను గోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను 48 గంట లలో రైతుల ఖాతాలలో జమ చేస్తారన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

క్రీడలతో ఉల్లాసం
శ్రీప్రజ్ఞ చైర్మన్ నాగబాబు

విశాలాంధ్ర - జగ్గంపేట : క్రీడల ద్వారా శారీరక, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించు కోవచ్చని శ్రీప్రజ్ఞ చైర్మన్ నాగ బాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రోలర్ స్టేట్ అసోషియేషన్ మంగళగిరిలో నిర్వహించిన క్రీడల్లో శ్రీప్రజ్ఞ విద్యార్థులు పోటీపడ్డారు. 36వ జిల్లా రోల్లర్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో శీరపు జశ్వంత్ రాష్ట్ర స్థాయి బంగారు పతకాన్ని, శీరపు హరిప్రియ కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. నాగబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని పెం పొందించుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాలలో జరిగే స్కేటింగ్ చాంఫియన్ షిప్‌కు పాఠశాల తరుపున విద్యార్థులను పంపించి ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీని వాసరావు, శ్వేత, కాలేజ్ ప్రిన్సిపాల్ అభి, స్కూల్ హెడ్మిస్ట్రెస్ సోఫియా, ఇన్చార్జి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ప్రాంగణంలో కాకినాడ జెఎన్‌టియుకె సెంట్రల్ జోన్ మెన్ అండ్ ఉమెన్ అథ్లె టిక్స్ ఛాంపియన్ షిప్ 2023-2024 పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డా ఆదిరెడ్డి రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జెఎన్‌టియుకె స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డా జి శ్యాంకుమార్, అంతర్జాతీయ అథ్లెటిక్ పిపి వరప్రసాద్, రాష్ట్ర పిఈటి అసోసియేషన్ నాయకులు నూకరాజు పాల్గొని ప్రారంభించారు. ఈ సమావేశంలో డా రమేష్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరగనున్న పోటీలో క్రీడా కారులందరూ మంచి క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి మంచి ప్రదర్శనతో విజేతగా నిలవాలని కోరారు. స్పోర్ట్స్ విభాగంలో గతంలో మంచి ప్రదర్శన చేసి గుర్తింపు పొందిన వారు నేడు వివిధ రంగాలలో మంచి స్థాయిలో ప్రభుత్వ రంగ సంస్థలు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొంది సేవలందిస్తున్నారు అని తెలిపారు. ఆదిత్యలో వరుసగా ఇది 10వ సారి ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుంది. ఈ అవకాశం ఇచ్చిన జెఎన్‌టియుకె వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని డా రమేష్ ఆదిరెడ్డి అన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన క్రీడాకారులు కోచ్‌లకు ఫిజికల్ డైరెక్టర్లకు అన్ని రకాల ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈవెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డా రవి మాట్లాడుతూ అథ్లెటిక్స్ విభాగంలో వివిధ పోటీలో పాల్గొనేందుకు రాష్ట్రం లోని వివిధ జిల్లాలకు చెందిన కళాశాలలకు చెం దిన 350 మంది పైగా క్రీడాకారులు పాల్గొంటు నట్లు చెప్పారు. జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం క్రీడాకారుల వందన సమర్పణ చేయగా ముఖ్య అతిధులు బెలూన్లు వదిలి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ ప్రో వి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా రవి, వివిధ కళాశాల నుండి వచ్చిన ఫిజికల్ డైరెక్టర్లు క్రీడాకారులు పాల్గొన్నారు. ఉదయం జరిగిన పోటీల్లో విజేతలకు ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి మెడల్స్ ప్రదానం చేసి అభినందనలు తెలియజేశారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో డివివి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డి చెన్నారావు పాల్గొని మాట్లాడుతూ విద్యా ప్రాముఖ్యత గురించి వివరించారు. అలాగే మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ అందించిన విశేష సేవల గురించి, ఆయన విద్యా విధానంలో తెచ్చిన మార్పులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ బాలరాజు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - జగ్గంపేట : మహిళల భద్రత, రక్షణ పై సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం టీవీఎస్ రంగారావు అధ్యక్షతన విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, జగ్గంపేట ఎంఈఓ 2ఏ సుబ్రహ్మణ్యేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఫోక్సో చట్టాలు, మహిళా భద్రత మరియు రక్షణకు సంబంధించిన చట్టాలపై క్షుణ్ణంగా వివరించారు. విద్యార్థినీ, విద్యార్థులకు ఏ విధమైన సహకారం కావాల్సిన 100కు లేదా జగ్గంపేట సీఐ 9440796529, ఎస్సై 9440796569కు ఫోన్ చేసి మహిళా రక్షక్ సేవలు పొందాలన్నారు. ఆన్లైన్, సైబర్ మోసాలు, నేరాల గురించి వివరించారు. ఫేస్బుక్, వాట్సప్, ఇన్స్టాగ్రామ్ వంటి వాటిలో ఫేక్ అకౌంట్లో వచ్చే మెసేజ్‌కు స్పందించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ హెచ్ఎం ఉస్మారా బేగం, సీనియర్ ఉపాధ్యాయులు ఎన్ కృష్ణ మోహన్, వివిఎస్ మూర్తి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టిడ్కో సమస్యల పై ఫిర్యాదు

విశాలాంధ్ర - అమలాపురం : కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో టిడ్కోలో సమస్యలు పై ఫిర్యాదు చేసారు. తాగు నీరు, వాడకం నీరు, సక్రమంగా రావడం లేదు. నెల నెల ఇస్తున్న పింఛన్లు టిడ్కోలో ఇచ్చే విధంగా ఏర్పాటు చేయాలి, టిడ్కోలో ప్రతి రోజు ఉండేలా ఒక ఉద్యోగిని నియమించాలి. వైద్య శిబిరాలు, వాహనాలు పార్కింగ్, స్మశాన వాటికకు స్థలం కేటాయించాలి అని కోరారు.

స్వామి సన్నిధిలో జిల్లా ఎస్పీ పూజలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారిని ఆదివారం అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయం మర్యాదలతో స్వాగతం పలికారు. డిప్యూటీ కమిషనర్ సూర్య చక్రధర్ రావు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

ఎస్ యానాం గ్రామాన్ని అభివృద్ధి చేయాలి

విశాలాంధ్ర - అమలాపురం : 30 సంవత్సరాలుగా చమురు నిక్షేపాలు వెలికితీసి వేలకోట్లు రూపాయలు తరలించుకుపోతూ ఎస్ యానాం గ్రామ ప్రజల ఉపాధి దెబ్బతిసిన వేదాంత ఆయిల్ కంపెనీ గ్రామాన్ని అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించకుండా అన్యాయం చేస్తుందని తక్షణమే గ్రామ నిరుద్యోగులకు ఉపాధి కల్పించి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. పదిరోజుల్లో గ్రామ సమస్యలు పరిష్కరించేలా వేదాంతా కంపినీ ఇచ్చిన హామీలు అమలు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో రవ్వ ప్లాంట్ కార్యకలాపాలు స్తంభింప చేసే విధంగా ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. ఉప్పలగుప్తం ఎస్ఐకి కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో లంకె బీమరాజు, పెట్టా అప్పా రావు, ఉల్లిశెట్టి దొరబాబు, పలచోళ్ళ బుజ్జి, కోటి పల్లి రాజు, ముత్తాబత్తుల శ్రీను, ఉంద్రు శామ్యూల్, సూరిబాబు, వెంకట్రావు, మేకల నానాజీ, వెంకటేశ్వర్లు, మీరా కుమార్, ఏడుకొండలు, చీకట్ల శ్రీను, ఏడుకొండలు, నాగు, పాల్గొన్నారు.

అపార్ ఐడి వివరాలను నిక్షిప్తం చేయాలి

కలెక్టర్ షన్మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : యూడైస్ ప్లస్‌లో ప్రతి విద్యార్థి అపార్ ఐడి, వివరాలను నిక్షిప్తం చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి ఆదేశించారు. ఒక విద్యార్థి-ఒక దేశం అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన యూడైస్ ప్లస్ విధానంలోకి విద్యార్థుల వివరాలను నమోదు చేయాలని, విద్యార్థుల సర్వే అపార్ ఐడి నమోదు ప్రక్రియపై అనుబంధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సోమవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యార్థులందరికీ తప్పనిసరిగా అపార్ ఐడి ఉండాలన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తుందన్నారు. ఈ క్రమంలోనే విద్యార్థుల విద్యార్హత, విద్యపై సమగ్ర వివరాలను సేకరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన వెబ్సైట్లోనే వివరాలు నిక్షిప్తం చేయాలన్నారు. అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఈనెల 16వ తేదీ లోగా విద్యార్థుల అపార్ ఐడి 100% నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. లేనియెడల ఆ పాఠశాల, కళాశాలల గుర్తింపు రద్దు చేస్తామని కాకినాడ జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. కాకినాడ జిల్లాలో మొత్తం 3,42,298 మంది విద్యార్థులకు గాను 2,17, 535 మందికి విద్యార్థులకు మాత్రమే అపార్ (ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీలు జతీష్ఠ్వ చేయడం జరిగిందని తెలియజేశారు. విద్యార్థుల సమగ్ర వివరాల కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ అన్నారు.

ఇద్దరు అంతర్ జిల్లాల దొంగలు అరెస్ట్

- సుమారు 13 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

విశాలాంధ్ర - సామర్లకోట : ఇంటికి తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర జిల్లాల దొంగలను సామర్లకోట పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సామర్లకోట సిఐ కృష్ణ భగవాన్ మీడియాతో మాట్లాడుతూ ఇటీవల వేట్లపాలెం గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో గుర్రం సాయిబాబు ఫిర్యాదు మేరకు వారు తెలిపిన వివరాలు ఆధారంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు ఆదేశాలు మేరకు దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు. ఈ మేరకు కోనసీమ జిల్లాకు చెందిన జిల్లెల రాకేష్ అరెస్టు చేయగా అతని ఇచ్చిన సమాచారంతో పశ్చిమగోదావరి జిల్లా తణుకు చెందిన చెందిన చావల కృష్ణను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి సుమారు 186.79 గ్రాముల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి స్వాధీనం చేసుకున్న బంగారు వస్తువులు విలువ సుమారు 13 లక్షల వరకు ఉంటుందని సిఐ తెలిపారు. ఈ మేరకు ముద్దయిలను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో క్రైమ్ సిఐ అంకబాబు తదితర పోలీస్ సిబ్బందిని పాల్గొన్నట్లు పేర్కొన్నారు. క్రైమ్ సీఐ అంకబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇల్లు వదిలి ప్రయాణాలు చేసేటప్పుడు ఇంటికి ఎల్‌హెచ్ఎంఎస్ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎవరైనా కొత్త వ్యక్తులు మీ ప్రాంతాల్లో అనుమాన స్పందంగా తిరిగితే వెంటనే సమాచారం అందించాలని ఆయన ప్రజలకు తెలియజేశారు.

పయ్యావుల బడ్జెట్ బేష్... సంక్షేమం అభివృద్ధికి సూచిక

రాష్ట్ర బడ్జెట్ పద్దులపై యనమల వ్యాఖ్య

విశాలాంధ్ర - కాకినాడ : ఎన్డీయే కూటమి ప్రజల ఆశలు ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ప్రణాళికా యుతంగా పనిచేస్తుందని శాసనమండలిలో అధికార పక్ష నేత యనమల అన్నారు. బడ్జెట్ అనేది సంక్షేమం, అభివృద్ధిని రెండింటినీ సమతుల్యం చేసిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సర్వాంధ్రప్రదేశ్ సాధించేలా తన బడ్జెట్‌ను పొందుపరిచారని కితాబునిచ్చారు. అభివృద్ధి ఎక్కడ ఉంటుందో సంక్షేమం అక్కడ ఉంటుందని పేర్కొన్న ఆయన ఈ రెండింటిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌కు రూపకల్పన చేసినట్లు కనబడుతుందన్నారు. అన్నిటికీ మించి ప్రభుత్వం ముందు ఉన్న ఐటీ, ప్రభుత్వ రుణం సవాళ్లను అధిగమించేందుకు బడ్జెట్ సూచిస్తుందని యనమల పేర్కొన్నారు.

పంట బోదు ఆక్రమణకు గురికాకుండా చూడాలి

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు మండలం కదలి గ్రామంలో పంట బోదును పూడ్చి అక్రమ కట్టడలు చేపట్టిన వారి పై చర్యలు తీసుకోవాలని న్యాయవాది యాలంగి రమేష్ సోమవారం రాజోలు తహశీల్దారు ప్రసాదకు వినతిపత్రం అందించారు. సుమారు 50ఎకరాల పొలాలకు సాగునీరు అందించే పంట బోదును గ్రామంలో కొందరు వ్యక్తులు పూడ్చి అక్రమ కట్టాడలు కడుతున్నారు. అక్రమ కట్టడాలు తొలగించి, పంట బోదె ఆక్రమణ గురికాకుండా రైతుల పంట పొలాలకు సక్రమంగా సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దారును కోరారు.

డిగ్రీ కళాశాలకు రూ.2.10 లక్షల విరాళం

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి నిమిత్తం మొదటి సంవత్సరం విద్యార్థుల ఫీజుల నిమిత్తం ఆలమూరు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ వారు రూ.2.10 లక్షల విరాళాన్ని అందజేశారు. కళాశాలలో చదివే డిగ్రీ మొదటి సంవ త్సరం విద్యార్థుల ఫీజుల నిమిత్తం రూ.1.63 లక్షలు, కళాశాలలో మంచినీటి సౌకర్యం, ఇన్వర్టర్ ఏర్పాటు తదితర అవసరాల కోసం రూ.50 వేలు రూపాయలతో కలిపి మొత్తం రూ.2.10 లక్షలను కళాశాల ప్రిన్సిపాల్ డా వి నరసింహస్వామికి ఆలమూరు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుణ్ణం వీర్రాజు, జాయింట్ సెక్రెటరీ గారపాటి త్రిమూర్తులు సోమవారం అందజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసించే మొదటి సంవత్సరం విద్యార్థుల ఫీజులను చారిటబుల్ ట్రస్ట్ భరిస్తుందని కనుక విద్యార్థులు అధిక సంఖ్యలో కళాశాలలో చేరి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం బాలస్వామి, సీనియర్ అసిస్టెంట్ తోట మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్క దాడిలో వృద్ధుడు మృతి

విశాలాంధ్ర - ఆలమూరు : వీధి కుక్కల దాడిలో ఒక వృద్ధుడు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండల కేంద్ర మైన ఆలమూరు గ్రామంలో చోటు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన అంగర సూర్యరావు (72) వృద్ధుడు సోమవారం పింఛ ప్రధాన కార్యక్రమానికి కలవచర్ల గ్రామం చేరుకోగా ఒక్కసారిగా సూర్యా రావుపై వీధి పిల్లల కుక్క దాడి చేసి బలంగా గాయపరిచింది. అప్పటికే అధిక రక్తస్రావం అయిన ఆ వృద్ధుడిని స్థానికుల సహకా రంతో ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి వ్యాక్సినేషన్లు అందించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సూర్యరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి ప్రతి గ్రామంలో ఉన్న వీధి కుక్కలను నిర్మూ లించ వలసిందిగా పలువురు కోరుచున్నారు.

రహదారి అంతాగుంత... ప్రయాణమంతా చింత

జొన్నాడ, మండపేట ప్రధాన రోడ్డును వెంటనే బాగు చేయాలి

విశాలాంధ్ర - ఆలమూరు : జొన్నాడ, మండపేట ప్రధాన రహదారిపై అడుగుకో గుంత, ప్రయాణమంతా చింత అన్నట్లుగా వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారి గుంతల్లో పడి అనేకమంది వాహనదారులు గాయాల పాలవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గుంతలను పూడ్చి, రహదారిని బాగు చేయాలని సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో విజ్ఞప్తి చేస్తూ ఎంపీడీవో రాజుకు ఆయన వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులకు మహిళా సంరక్షణపై అవగాహన

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు మేరకు కొత్తపేట డీఎస్పీ పర్యవేక్షణలో రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్, మరియు ఆత్రేయపురం ఎస్ఐ ఎస్ రాము ఆత్రేయపురం మహాత్మా గాంధీ కాలేజ్ నందు విద్యార్థులకు మహిళ సంరక్షణ అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సదరు కార్యక్రమంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆడవారు పిల్లలు ఏ విధంగా ఉండాలో ఎటువంటి పరిస్థితులైన అధిగమించి అప్రమత్తులతో ధైర్యంగా ఉండాలని తెలియజేసారు. సదరు విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైన తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు లేదా పోలీసు వారికి తెలిపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ సిహెచ్ విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్ఐ ఎస్ రాము ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేనలోకి చినబాబు

విశాలాంధ్ర - అల్లవరం : 40 సంవత్సరాల నుండి టిడిపిలో తనకంటూ ఒక సైలులో పార్టీ నాయకత్వం వహించారు. సోమవారం జనసేన పార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమక్షంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గునిశెట్టి చినబాబు మంగళగిరిలో జనసేన కండువా కప్పుకున్నారు. 2014లో అమలాపురం నియోజకవర్గం మార్కెట్ కమిటీ పదవి చేపట్టి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేశారు. 2019లో టిడిపి అధికారం కోల్పోవడంతో కొన్ని కారణాలవల్ల వైఎస్ఆర్ పార్టీలో జాయిన్ అయ్యారు. అయినాప్పటికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి పార్టీలో జాయిన్ అయ్యారు. ఈయన పార్టీలో జాయిన్ అవ్వడంతో అమలాపురం నియోజకవర్గంలో తన వర్గం ఉత్సాహంతో సంబరాలు జరుపుకుంటున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

అడిషనల్ కమిషనర్ సుధాకర్

విశాలాంధ్ర - కాకినాడ : డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని కాకినాడ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ కెటి సుధాకర్ నగరపాలక అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అదనపు కమిషనర్ కెటి సుధాకర్ నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా విని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ ఇలా పలు సమస్యలపై సుమారు 50 వరకు అర్జీలు అందాయి. వాటిపై అదనపు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. పరిష్కరించిన అర్జీల వివరాలు ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎంహెచ్ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ శిరీష్, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వెంకట్రాజు, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

రత్నేష్ కుమార్‌తో మల్లాడి, మునుస్వామి భేటీ

విశాలాంధ్ర - యానాం : యానం నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న 231 మంది మత్స్యకారుల నష్ట పరిహారం ఆరుకోట్ల 37 లక్షల 50 వేల రూపాయలను ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలని కోరారు. అర్హులైన మొత్తం మత్స్యకారులు(5289ం231) 5520 మందికి ఇంకా విడుదల చేయా ల్సిన ఐదు నెలల 14 రోజులకు సంబంధించి నిధులను విడుదల చేయాలని కోరారు. సిఎస్ఆర్ పనులకు సంబంధించి 25 పనులలో ఇప్పటికే 23 పను లకు టెండర్లు పిలిచారని, వివరించిన మల్లాడి. జనవరి నెలాఖరు నాటికి ఇప్పటివరకు జరిగిన చిన్న చిన్న అభివృద్ధి పనుల సంబంధించి యుసి అందజేయడం జరుగుతుందని, మిగిలిన డెవలప్మెంట్ ఫండ్‌కు సంబంధించిన యుసి మార్చిలో అందజేయడం జరుగుతుందని వివరిస్తు అండర్ టేకింగ్ లెటర్ సమర్పించడం జరిగిందని మల్లాడి కృష్ణారావు తెలిపారు.

పేపరుమిల్లులో పని కల్పించాలని నిరసన

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని పినపళ్లలోనున్న పేపరుమిల్లులో పని కల్పించాలంటూ మహిళలు సోమవారం తమ నిరసనలు తెలియజేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం సమీపంలోని రావిచెట్టు వద్ద నిరసన తెలుపుతూ ఆదిశగా వెళ్లే వాహనాలను నిలిపివేశారు. గత రెండేళ్లుగా స్థానికులకు పని కల్పించాలంటూ పేపరు మిల్లు యాజమాన్యానికి, ప్రజా ప్రతినిధులకు వినతులు అందజేస్తున్నా పట్టించుకోకపోవడం వల్లే తమ నిరసనకు దిగినట్లు మహిళలు తెలిపారు. గ్రామ ప్రజలకు పనులను కల్పించకపోవడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కొత్తూరు-వెదురుమూడి రోడ్డులో భారీ వాహనాలు నిలిచిపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. ఉదయం నుంచి రాత్రి వరకూ ట్రాఫిక్ నిలిచిపోయినా నిరసన తెలుపుతున్న మహిళలను కనీసం పరామర్శించి సమస్యలను పరిష్కరించాలన్న స్పృహ ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులకు కానీ, యాజమాన్యంతో పాటు మరెవ్వరికీ లేకపోవడం విమర్శలకు తావిస్తుంది.

మౌలానా ఆజాద్ నుంచి స్ఫూర్తిని పొందాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర - భీమవరం : విద్య వల్ల ఉజ్వల భవిష్యత్తు సాధ్యం అని ఆనాడే గుర్తించిన మహనీయుడు మౌలానా ఆజాద్ నుండి స్ఫూర్తిని పొందాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట కాన్ఫ రెన్స్ హాల్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా నిర్వహించిన మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగ రాణి ముందుగా ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతరత్న దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ఎంతో ఆదర్శనీయమైనదని, వారి కలలను సాకా రం చేయుటకు కృషి చేయాలన్నారు. దేశానికి మౌలానా ఆజాద్ చేసిన సేవలను గుర్తించి ఆయన జయంతి రోజున కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మైనార్టీసంక్షేమం, జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ తొలి విద్య శాఖ మంత్రిగా 11 సంవత్సరాల పాటు విద్యా రంగానికి ఎనలేని కృషి చేశారని, విద్యా వికాసం కోసం ఆయన విద్యా మంత్రిగా కొనసాగిన కాలంలో పాఠశాల విద్యను ఎంతో గుణాత్మకంగా మార్పు చేసి వృత్తి విద్యను క్రీడా విద్యను ప్రోత్సహించారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ మౌలానా ఆజాద్ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పు లు తీసుకొని వచ్చి ఉపాధ్యాయులు, విద్యార్థులకు స్నేహితుడిగా, మార్గదర్శకుడిగా ఉంటూ జ్ఞాన ప్రసా రాన్ని వ్యక్తిత్వ నిర్మాణం కోసం కృషి చేశారన్నారు. ఇన్చార్జి జిల్లా మైనార్టీ అధికారి హెచ్.వి.ఎస్ మూర్తి, డిఐఇ కార్యాలయం సహాయ సంచాలకు ఎన్.సత్యనారాయణ, ముస్లిం పెద్దలు మహబూబ్ అలీ ఖాన్, ఎం.డి రియాజు ద్దీన్, చెన్న రంగనిపాలెం ఎంపిఎల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏజీపీగా బాధ్యతలు స్వీకరించడం గర్వకారణం

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు న్యాయస్థానం ఏజీపీగా బాధ్యతలు స్వీకరించిన లాయర్ విద్యా ప్రసన్నను కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పలువురు దళిత నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపి, దుశ్శాలువా కప్పి సత్కరించారు. 33 సంవత్సరాల తరువాత ఎస్సీ సామాజిక వర్గానికి మహిళ ఏజీపీగా బాధ్యతలు స్వీకరించడం గర్వకారణం అని వారు అన్నారు. కార్యక్రమంలో నల్లా వెంకటరమణ, కోనాల అంబేద్కర్, బహదూర్, పాలంగి రవిచంద్ర, సత్యనారాయణ, రాజశేఖర్, నెల్లి చిన్న, దిద్ది రాము పాల్గొన్నారు.

వన సమారాధన డ్రాలో అరుణ్‌కి స్మార్ట్ టీవీ

విశాలాంధ్ర - పెదపూడి : కోస్టాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వన సమారాధన కార్యక్రమంలో అనపర్తి సత్యాగ్రహం రిపోర్టర్ చాకర్ల అరుణ్ కుమార్‌కి డ్రాలో ఫస్ట్ ప్రైజ్ స్మార్ట్ టీవీ బహుమతిగా లభించింది. కోస్టాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం జర్నలిస్టులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్సులోని కూపన్లు డ్రా తీయగా విన్ అయిన అరుణ్ కుమార్‌కి ప్రథమ బ హుమతిగా స్మార్ట్ టివి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా నిర్వా హకులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రథమ బహుమతి లభించిన అరుణ్ కుమార్‌ను ఎంవివిఎస్ఎన్ రెడ్డి (సూర్య రెడ్డి) బిక్కవోలు, సీనియర్ పాత్రికే యులు సత్తి శ్రీనివాసరెడ్డి, అనపర్తి ప్రెస్ క్లబ్ కార్యవర్గం అభినందించారు.

ఘనంగా రమణ బాబు పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు పుట్టిన రోజు వేడుకలు సోమవారం అమలాపురంలో అంగ రంగ వైభవంగా జరిగాయి. వందలాది మంది తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మెట్ల స్వగృహానికి చేరుకుని రమణ బాబుకి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి, ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు, అమలాపురం అర్బన్ డేవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ సోంబాబు. చిక్కాల గణేష్, నల్లా స్వామి, నల్లా చిన్న, వాసంశెట్టి సత్యం, దున్నాల దుర్గ, చిల్లా జగదేశ్వరీ, చిల్లా పురుషోత్తం, జంగా అబ్బాయి వెంకన్న, దెందుకూరి సత్తిబాబు, ఈతకోట నాగేశ్వరావు, బోనం సత్తిబాబు, బోనం సత్య వర ప్రసాద్, బీజేపీ నాయకులు మోకా వేంకట సుబ్బారావు, కొండేటి ఈశ్వర గౌడ్, బొంతు శివాజీ, జనసేన నాయకులు నూడా చిన్న, చిక్కాల సతీష్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శివకుమార్, మధు

విశాలాంధ్ర - ఏలూరు : అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా దుబ్బాక శివకుమార్,యర్రా మధు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నూతన అధ్యక్ష కార్యదర్శులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 09,10 తేదీలో స్థానిక సీపీఐ కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ ఘనంగా నిర్వహించుకుని జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు.నూతన జిల్లా అధ్యక్షులుగా దుబ్బాక శివ కుమార్, జిల్లా కార్యదర్శిగా యర్రా మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సహాయ కార్యదర్శులుగా కృష్ణ, అశోక్ ఉపాధ్యక్షులుగా నాని, వినోద్, 11 మంది సభ్యులతో నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర-ముసునూరు: జీవనోపాధి కోసం భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలిసి కుటుంబ సభ్యులను పరామర్శించ వచ్చిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులకు వారు తెలిపిన వివరాలు ప్రకారం ముసునూరు మండలం చింతపల్లి పంచాయతీ గోగులంపాడు కొత్తూరుకు చెందిన చెన్ను రాజారావు కొన్ని సంవత్సరాలుగా కౌలుకు భూమిని తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గడచిన రెండు మూడు సంవత్సరాల కాలంగా పంటలు సరిగా పండక,పండిన పంటకు గిట్టుబాటు ధర లేక అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడని వాపోయారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా రైతు సంఘం కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజక వర్గంలో ఆత్మహత్యకు గురికావడం దురదృష్టకరమన్నారు. వ్యవసాయం కోసం తీసుకున్న మృతుని అప్పులను ప్రభుత్వం రుణమాఫీ చేసి వెంటనే అతని కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీరితోపాటు రైతు సంఘం జిల్లా నాయకులు నిమ్మ గడ్డ నరసింహ, మండల నాయకులు చెంగల వెంకటేశ్వర రావు,ఏఐటియుసి నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి పుల్లారావు ఉన్నారు.

ఘనంగా అబుల్ కలాం జయంతి వేడుకలు

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: భారత స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖమంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం జరిగాయి. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి.విశ్వేశ్వరరావు,జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎన్.ఎస్.కృపవరం,డిఈవో వెంకటలక్ష్మీ, డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు, ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.